# 'కొత్త కడవ'

-బి.బాలచందర్

అనాలోచితంగా తల ఎత్తి చూశాను. ఆ మూల టైపిస్టు సీటు ఖాళీగా ఉంది.

మాధవి తలపుకొచ్చింది. మనస్సు ఒకింత చివుక్కుమంది.

ఈ ఎల్.ఐ.సి. వారు కొందరికి అలా టెంపోరరీ అపాయింట్‌మెంట్ ఇచ్చి, తర్వాత ఊస్టింగ్ ఆర్డర్స్ చేతిలో పెట్టకపోతే ఏం- ఎవరికో ఒకరికి పర్మినెంట్ ఆర్డర్స్ ఇస్తే పోదా అన్పించింది!

"మేడమ్, మేనేజర్ గారు రమ్మంటున్నారు"

వెళ్ళాను.

ఓ అరగంట తర్వాత తిరిగి ఆ మూలకు ఎందుకో తలెత్తి చూశాను.

అక్కడో ఆజాను బాహుడు కూర్చున్నాడు.

మా ఆఫీసులో అంత పర్సనాలిటీ గల వ్యక్తి ఎవ్వరూ లేరు.

ఇంత వరకూ నాకంటి కెవరూ అలాంటి వాళ్ళు ఎదురుపడలేదు.

కొనతేరిన ముక్కూ, కండ్లద్దాలూ, నిగనిగ లాడే నల్లని వెంట్రుకలూ, పసిమి ఛాయా, అతడు ఎవరి వైపూ చూడటంలేదు.

నాకు ఆశ్చర్యమేసింది. ప్రతి విషయానికి డెలికేట్‌గా ఎందుకు ఫీలవుతున్నానో నాకే తెలీడంలేదు.

తిరిగి తల ఫైళ్ళోకి దూర్చాను.

'నమస్తే మేడమ్' అంటూ ఆజానుబాహుడు నా ముందు నిలబడ్డాడు. బహుశా నా డ్రాఫ్టింగ్ అర్థం కాలేదేమో? బి.ఏ. చేయడం నా తప్పేమో అన్పించింది. ఏదో రెక్‌లెస్‌గా చదవడం ఫస్టు క్లాసులో పాస్‌కావడం, ఎల్.ఐ.సి.లో ఉద్యోగం దొరకడం ఒకటొకటి చకచకా జరిగిపోయాయి. చివరికి ఎనీ ప్రాబ్లమ్?' అడిగాను.

"ఇక్కడ పొరపాటు రాశారు మేడమ్. సెంటెన్స్ సరిగ్గా లేదు. అంకెలు కూడ పొరపాటుగా వ్రాశారు."

అతడు చెప్పింది నిజమే! సరిచేస్తూ 'సారీ' అన్నాను. అతడు మౌనంగా వెళ్ళిపోయాడు. వెళ్ళిపోతోన్న అతని వైపు అలాగే చూస్తుండిపోయాను.

"ఈరోజు నాకేమైంది?" నాలో నేనే ప్రశ్నించుకొన్నాను.

సాయంకాలం గుడిలో నాతోటి సహోద్యోగి రమణి కలిసింది.

మాటల్లో ఎందుకో ఆమే చెప్పుకొచ్చింది.


"ఏమో! రాధికా. ఈరోజు మన ఆఫీసులో టెంపొరరీగా



చేరినతని పేరు అశ్వత్థామ ఎం.ఏ(లిట్) ఎం.ఫిల్. ఇంగ్లీషు సాహిత్యంలో ఎవ్వరికి తెలీని విషయమ్మీద రిసెర్చి చేస్తాననుకుంటున్నాడా.

జాబ్ దొరక్క, ఆర్థిక పరిస్థితులు బాగోలేక చిన్నప్పుడు నేర్చిన టైపురైటింగ్ సర్టిఫికెట్టుతో ఇలా మన ఆఫీసులో చేరాడు.

నేను విస్తుపోయాను. అంత చదువు చదివీ ఏమిటీ చిరు కొలువు బాధపడ్డాను.



నా చిన్నప్పుడు ఒక జోక్ గుర్తుకొచ్చింది.

ఓసారి మావూరి వాడైన ఓ మినిస్టర్ దగ్గరికెళ్ళి మా బాబాయి 'సార్! నేను బి.ఏ. పాసయ్యాను. నాకేదైనా ఉద్యోగం ఇప్పించండి' అన్నాడట.

అందుకు మినిస్టరు విరగబడి నవ్వి "వెళ్ళవయ్యా బాబూ! ఐ.ఏ.ఎస్. చదివిన వారికే ఉద్యోగాలు లేవు. బోడి బి.ఏ.చదివే వాడికి ఎవరిస్తారయ్యా ఉద్యోగం? అన్నారట. మా బాబాయి బిత్తర పోయి బుద్ధిగా వ్యవసాయంలో చేరి స్టేట్ లెవల్లో కృషీవలుడుగా బహుమతి పొందాడు.

అంటే ఆనాటికీ ఈనాటికీ చదువుల మీద పెద్దవాళ్ళ దృక్పథం మారడం లేదనిపించింది.

ఇంటర్ మీడియట్ చదివిన వాడు సెంట్రల్ గవర్నమెంట్ సర్వీసులో ఉద్యోగం సంపాదించి మిడిమిడి జ్ఞానం వెలగబెడుతూంటే, పి.హెచ్.డీ. చేసినవాడు ఫుట్‌పాత్‌పై నిరుద్యోగంతో దిక్కుతోచక పచార్లు చేస్తున్నాడు.

వ్యవస్థను ఆడిపోసుకునే దానికన్నా - అదృష్టాన్ని నిందించుకుంటే బావుంటుందేమో!

రోజులు గడిచిపోతున్నాయి.

జీవితంలో ఏనాడూ కట్టుబొట్టు మీద శ్రద్ధచూపని నేను ప్రతీదినం ఉదయం అరగంట అద్దం ముందు ముస్తాబవుతూంటే ఎంతో సిగ్గువేసింది. అశ్వత్థామ అంటే ఏదో తెలీని ప్రేమ! కాని అతడు మటుకు కన్నెత్తి చూడటంలేదు.

లవ్ ఎట్ ఫస్ట్ సైట్ కాదు కదా? ఏమో? మనసుకేమీ అర్థం కావడం లేదు.

ఒకరోజు ఓ సంఘటన జరిగింది.

అశ్వత్థామ సైకిల్ మీద వస్తూంటే వెనుక నుండి జీపుకొట్టింది. ఆ రోజు ఆఫీసులో ఉండలేకపోయాను.

ఆ సాయంకాలం నేనూ, రమణీ అతని ఇల్లు వెతుక్కుంటూ వెళ్ళాం.

ఇంటిల్లిపాదీ ఎంతో ఆప్యాయంగా చూశారు.

అశ్వత్థామను చూస్తూంటే, నా కన్నుల్లోంచి నాకే తెలీకుండా ఎందుకో కన్నీటి చుక్కలు రాలాయి.

ఎవరూ చూడకుండా నే చేతిరుమాలుతో తుడుచుకొన్నాను.

నా ముఖంలోకి సూటిగా చూసి రమణి అంది 'కొంపతీసి, అశ్వత్థామను ప్రేమిస్తున్నావా? ఏమిటి? అలాంటి పనులు పెట్టుకోకే! మీది సాంప్రదాయ కుటుంబం. నీ తర్వాత పెళ్ళి చెల్లెళ్ళుముగ్గురున్నారు. నీ స్వార్థం కోసం ఇతరుల జీవితాలను బలిచెయ్యొద్దు" హెచ్చరించింది.

మనసు చివుక్కుమంది. నా ప్రవర్తనే రమణిని అలా మాట్లాడించిందేమో!

నా మనో దౌర్బల్యానికి నేనే సిగ్గు పడ్డాను.

ఎప్పుడూ అశ్వత్థామ గురించే ఆలోచనలు.

ఒకసారి రమణి నన్ను నిలేసి అడిగింది.

"ఏమిటే! అశ్వత్థామ అంటే అలా పడిచస్తున్నావు. అతను నీవైపు కన్నెత్తి కూడా చూడలేదంటున్నావు. వన్‌సైడ్ లవ్ కాదు కదా? అసలు నీవంటే పడిచచ్చే ఎందరో ఉద్యోగస్థులు, కట్న కానుకలొద్దంటూ ఇంటి ముందు కాపలా కాస్తూ కూర్చొని ఉంటే. నువ్వేమో ప్రేమ పిచ్చిలో పడ్డావు. ఇది జీవితమే. బొమ్మలాట కాదు. పగిలిపోయిన బొమ్మను పారేసి వేరేబొమ్మను తెచ్చి బొమ్మల కొలువులో పెట్టడానికి కులాలు వేరు, కట్టు బాట్లు వేరు, ఆర్థిక పరిస్థితులు వేరు, ఒకవేళ నువ్వు సాహసించిన నీ బిడ్డలకు అడుగడుగున ఎదురయ్యే సమస్యలను నువ్వూ నీభర్త పరిష్కరించలేరు."

"నేను బొమ్మలాగా నిర్వీర్యురాలై వింటూంటే తిరిగి ప్రారంభిం చింది.

"చివరగా ఒక్క మాట చెప్తాను, అతడి ఉద్యోగ మంటూ లేదు. ఉద్యోగమొచ్చినా అతడి వెనుక చాలా బరువు భాద్యతలున్నాయి. అతడి కోసం కాచుకొని కూర్చున్న అక్క బిడ్డలున్నారు. ప్రేమ పుడుతుంది, బుడగ మాదిరిగా పగిలిపోతుంది." చెప్పింది.

నాకు రాత్రి నిద్రరాలేదు. ఆలోచనలతో తల వేడెక్కిపోయింది. ఉదయం ఆఫీసుకెళ్ళాను. నాకెదురుగా రూంలో చల్లని నీళ్ళు ఒసగే క్రొత్త కడవ. నెఱ్ఱ చీలి రెండుగా పగిలిపోయింది. నీళ్ళతో ఆ రూం తడిగా ఉంది.

క్రొత్త కడవ మూడు రోజులుగా ఎంతటి తియ్యని చల్లని నీళ్ళిచ్చిందో అనుకుంటే బాధవేసింది.

తల ఎత్తి టైపిస్ట్ సీటు వైపు చూశాను. అక్కడ అశ్వత్థామ లేడు. మరో అమ్మాయి కూర్చొని టైపు చేస్తోంది.

పగిలిపోయిన కొత్త కడవ ముక్కలను బయట పారేసేందుకు అటెండర్ తీసుకెళ్తూంటే మనస్సెందుకో తునాతునకలైపోయింది.


బి.బాలచందర్
ఇ.నం.5/175,ఫ్లవర్ వీధి,
కదిరి - 515 591
అనంతపురం - జిల్లా.


★

## అమెరికా

"ఈ మ్యాప్‌లో అమెరికా ఎక్కడుందో చెప్పరా గోవింద్?"

ఇక్కడ సార్ మ్యాప్‌లో చూపించాడు.

"గుడ్... నువ్వుకూర్చో... అమెరికాను కనుకున్నది ఎవరో చెప్పరా రవీ...?

"గోవింద్ సార్"


-పాలుమూరి సంపత్‌కుమార్
ఇ.నం.3-8-17, రేచర్లపేట,
కాకినాడ-533 003.